
సాక్షి
ఒడిశా

బుధవారం । 8 । మే । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం మంగళవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.3,03,841లు, బంగారం 20 మిల్లీగ్రాములు, వెండి 21 గ్రాముల 500 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



కాంగ్రెస్‌లోకి బీజేపీ నాయకుడు దాస్ భొత్ర

బొరిగుమ్మ సమితి మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత దాస్ భొత్ర మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు.

- 8లో



మళ్లీ బీజేడీదే అధికారం

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈసారి కూడా రాష్ట్రంలో బీజేడీ పార్టీ అధికారంలోకి రానుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి అతాను సవ్యసాచి నాయక్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

ప్రచార వాహనంపై బీజేపీ నాయకుల దాడి



బీజేడీ ప్రచార వాహనంపై ఫ్లెక్సీలు చించివేసిన దృశ్యం

బరంపురం: గోపాల్‌పూర్ నియోజకవర్గం బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న విక్రమ్ కుమార్ పండా ఎన్నికల ప్రచార వాహనంపై ప్రత్యర్థి బీజేపీ కార్యకర్తలు దాడి చేసిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. మంగళవారం ఉదయం రొంగాయిలోండ గ్రామంలో బీజేడీ ప్రచార వాహనంపై బీజేపీ నాయకులు దాడిచేసి, సీఎం నవీన్ పట్నాయక్ పోస్టర్లను చింపివేయడం జరిగింది. ఈ సంఘటనపై గోళంతర పోలీసు స్టేషన్‌లో బీజేడీ ఎమ్మెల్యే అభ్యర్థి విక్రమ్ కుమార్ పండా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

82 కిలోల గంజాయి సీజ్



అరెస్టైన నిందితులు

బరంపురం: నగరంలోకి అక్రమంగా ఆటోలో గంజాయి తరలిస్తున్నట్లు బరంపురం ఎక్సైజ్ అధికారులకు మంగళవారం ఉదయం ముందస్తు సమాచారం వచ్చింది. దీంతో బరంపురం ఎక్సైజ్ అధికారులు హింజికాట్ – దిగపండి – బరంపురం మధ్య మూడు రోడ్ల జంక్షన్‌లో కాపుకాసారు. దిగపండి నుంచి బరంపురం నగరంలోకి వస్తున్న ఆటోపై చికిరి గ్రామం దగ్గర దాడిచేసి 4 బస్తాల్లో తరలిస్తున్న 82 కిలోల గంజాయితో పాటు ఆటోని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురుని అరెస్టు చేశారు. అరెస్టైనవారు జగన్నాథ్ ప్రసాద్ బ్లాక్‌కు చెందిన రబీంద్ర ప్రధాన్, సురడా గ్రామానికి చెందిన సుభాష్ రౌలో, మనోజ్ రౌథ్‌గా గుర్తించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలియజేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి



ప్రమాదం జరిగిన దృశ్యం

బరంపురం: గంజాం జిల్లాలోని ఛత్రపూర్ – బరంపురం మధ్య 16వ నంబర్ జాతీయ రహదారిలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు డ్రైవర్ మృతి చెందగా, కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయలయ్యాయి. సమాచారం అందుకున్న చమ్మఖండి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని కారులో ప్రయాణిస్తున్న క్షతగ్రాతును రక్షించారు. పోలీసు అధికారులు చెప్పిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం భువనేశ్వర్ నుంచి బరంపురం వస్తున్న సమయంలో తీవ్రంగా మంచు కురుస్తుండడంతో కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో దుర్ఘటన జరిగింది. గాయలతో ఉన్న ఇద్దరిని రక్షించి 108 అంబులెన్స్ సాయంతో ఛత్రపూర్ ప్రాథమిక చికిత్స కేంద్రానికి తరలించారు. డ్రైవర్ మృతదేహన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎంకేసీజీ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అథ్లెటిక్స్‌లో గోల్డ్ మెడల్స్ కైవసం



జాతీయ పతాకంతో కిశోర్ చంద్రరథ్

పర్లాకిమిడి: శ్రీలంక రాజధాని కొలంబోలో ఈనెల 3వ తేదీ నుంచి 8 వరకు జరుగుతున్న అంతర్జాతీయ అథ్లెటిక్స్ గేమ్స్–2024 పోటీల్లో గజపతి జిల్లా పర్లాకిమిడికి చెందిన కిశోర్‌చంద్ర రథ్ 60 కేజీల విభాగంలో మూడు బంగారు పతకాలు సాధించాడు. ఆయన వంద మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, ట్రిపుల్ జంప్ పోటీల్లో సత్తాచాటాడు. బంగారు పతకాలు సాధించడంపై పర్లాకిమిడి ప్రజలు, క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తాను పోటీల్లో పాల్గొనడానికి ఆర్థిక సహకారం అందించిన స్వాస్ స్వచ్ఛంద సంస్థ, ప్రెసిడెంట్ డి.జగన్నాథరాజుకు కిశోర్ రథ్ ధన్యవాదాలు తెలిపారు.

ప్రముఖులకు.. పట్టంకట్టిన నవరంగపూర్

- దక్షిణ ఒడిశా నుంచి తొలి ముఖ్యమంత్రిని అందించిన వైనం
- ఈసారి గెలుపెవరిదో?



9 సార్లు గెలుపొందిన జనాబ్ హబిబుల్లా ఖాన్

తొలిసారి ముఖ్యమంత్రి అయిన సదాశివ త్రిపాఠీ

గౌరీశంకర మఝి (బీజేపీ)

కౌశల్యప్రదాని (బీజేడీ)

దిలీప్ ప్రధాన్ (కాంగ్రెస్)

జయపురం: ఒడిశా రాష్ట్రంలోని నవరంగపూర్ విధానసభ నియోజకవర్గానికి ఒక ప్రత్యేకత ఉంది. సదాశివ త్రిపాఠీ, జనాబ్ హబిబుల్లా ఖాన్ లాంటిగొప్ప నాయకులు ఇక్కడివారే. లక్ష్మీకాంత దాస్, మహమ్మద్ బాజీ, జి.అన్నాజీ రావులాంటి అనేక మంది స్వాతంత్ర్య సమర యోధులు పుట్టిన గడ్డ. అలాగే దక్షిణ ఒడిశా నుంచి రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిని అందించిన నియోజకవర్గం నవరంగపూర్. మతాలకు అతీతంగా ఒక ముస్లిం మహానేతను, ముస్లిం స్వాతంత్ర్య యోధుడుని రాష్ట్రానికి అందించిన ఘనత దక్కించుకుంది. 1992 సంవత్సరానికి ముందు అవిభక్త కొరాపుట్‌లో భాగమైనది నవరంగపూర్. కాంగ్రెస్‌కు కంచుకోట అని చెప్పేకంటే జనాబ్ హబిబుల్లా ఖాన్‌కు బలమైన దుర్గం అని చెప్పవచ్చు. ఆయన ఎన్నికల బరిలో దిగిన నాటి నుంచి 2009లో నియోజకవర్గాన్ని ఎస్టీలకు కేటాయించే వరకు ఓటమెరుగని రాజకీయ యోధుడాయన. నవరంగపూర్ 1951లో నవరంగపూర్ ఇద్దరు సభ్యుల నియోజకవర్గం. వాటిలో ఒకటి ఎస్టీలకు కేటాయించారు. మరొకటి జనరల్. ఆనాడు ఈ నియోజకవర్గంలో నవరంగపూర్ సబ్‌డివిజన్ (ఉమ్మరకోట్ సబ్ డివిజన్ మినహా నేటి నవరంగపూర్ జిల్లా) కొరాపుట్ సబ్ డివిజన్‌లో పాడువ, పొట్టంగి, సెమిలిగుడ, నందపూర్ పోలీసుస్టేషన్లు ఉండేవి. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు సదాశివ త్రిపాఠీ (జనరల్) ముదు నాయిక్ (ఎస్టీ) లు గెలుపొందారు. 1957లో కొన్ని మార్పులు జరిగాయి. ఇద్దరు సభ్యుల స్థానమే అయినా ఎస్టీ అభ్యర్థికి బదులుగా ఎస్సీ అభ్యర్థికి కేటాయించారు. 1952లో నవరంగపూర్ నియోజకవర్గంలో అంతర్ భాగాంగా ఉండే పొట్టంగిని శాసనసభ నియోజకవర్గంగా విడదీసి ఎస్టీలకు కేటాయించారు. 1957 ఎన్నికలో ఈ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థులు సదాశివ త్రిపాఠీ (జనరల్) మిరు హరిజన్ (ఎస్సీ) లు విజయం సాధించారు. 1961 ఎన్నికల నాటికి ఈ నియోజకవర్గం నవరంగపూర్, కొడింగలకే పరిమితం చేసి ఎస్సీలకు కేటాయించారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి మిరు హరిజన్ మరోసారి విజయం సాధించారు. 1967 నాటికి ఈ నియోజకవర్గం జనరల్‌గా మార్చారు. అప్పట్లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి సదాశివ త్రిపాఠీ మూడోసారి గెలుపొందారు. సదాశివ త్రిపాఠీ రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యారు. 1965 అక్టోబర్ రెండు నుంచి 1967 మార్చి ఎనిమిదో తేదీ వరకు ముఖ్యమంత్రి పదవిలో కొనసాగారు. 1971 ఎన్నికల నాటికి స్వతంత్ర్య పార్టీ హవాలో కాంగ్రెస్ కొట్టుకుపోయింది. ఆ ఎన్నికలలో జనాబ్ హబిబుల్లా ఖాన్ స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా మొదటిసారి గెలుపొందారు. 1974లో జరిగిన ఎన్నికలో కూడా హబిబుల్లా ఖాన్ మరోసారి స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా విజయం సాధించారు. 1977 ఎన్నికల నాటికి హబిబుల్లా ఖాన్ కాంగ్రెస్‌లో చేరారు. 1977 ఎన్నికల నుంచి ఈ నియోజకవర్గం ఎస్టీలకు కేటాయించేంత వరకు అంటే 2009 నాటి వరకు ఆయన నవరంగపూర్‌లో విజయయాత్ర కొనసాగించారు. రెండుసార్లు స్వతంత్ర పార్టీ అభ్యర్థిగా ఏడుసార్లు కాంగ్రెస్ పార్టీ తరపున విజయాలు సాధించిన ఖాన్ జానకీ వల్లభ పట్నాయక్ మంత్రివర్గంలో కీలకమైన మంత్రి పదవులు నిర్వహించారు. రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం అమలు చేసినా అది నవరంగపూర్ నియోజకవర్గం నుండే ప్రారంభించేందుకు ముఖ్యమంత్రి జానకీ వల్లభ పట్నాయక్‌ను ఒప్పించేవారు. ఆయన హయాంలో నవరంగపూర్ జిల్లా యువతకే కాకుండా అవిభక్త కొరాపుట్ జిల్లాలో వేలాదిమంది యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత హబిబుల్లా ఖాన్‌కి దక్కింది. 2009 నాటికి ఈస్థానం ఎస్టీలకు కేటాయించటంతో మరోసారి పోటీ చేసే అవకాశం ఆయనకు కలగలేదు. అవిభక్త కొరాపుట్‌లో ఏకైక జనరల్ స్థానం అయిన జయపురం నుంచి పోటీ చేయమని ఈ ప్రాంత ప్రజలు ఆయనను కోరినా పార్టీ నియమాలకు కట్టుబడిన ఖాన్ అందుకు అంగీకరించలేదు. 2009లో ఎస్టీ స్థానంగా మారిన ఈ నియోజకవర్గంలో బీజేడీ అభ్యర్థి మనోహర రౌందారి గెలుపొందారు. 2014 ఎన్నికలో కూడా మనోహర రౌందారి ఎన్నికయ్యారు. 2019 ఎన్నికలో బీజేడీ అభ్యర్థి సదాశివ ప్రధాని బీజేపీ అభ్యర్థి గౌరిశంకర మఝిపై 6064 ఓట్ల తేడాతో గెలుపొందారు. ఆ ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థి సదన నాయిక్ ఓటమి చెంది మూడో స్థానానికి పరిమితమయ్యారు. ఈ ఎన్నికలు సదాశివ ప్రధానికి 58,335 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి గౌరీ శంకర మఝికి 52,271 ఓట్లు, కాంగ్రెస్ అభ్యర్థి సదన నాయక్‌కు 49,232 ఓట్లు వచ్చాయి. ఈ నెల 13వ తేదీన జరుగనున్న సారత్విక ఎన్నికల్లో ప్రధాన పోటీలో కాంగ్రెస్ అభ్యర్థిగా దిలీప్ ప్రధాన్, బీజేడీ తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే సదాశివ ప్రధాని సతీమణి కౌశల్య ప్రధాని, బీజేపీ అభ్యర్థిగా గత ఎన్నికలో 49,232 ఓట్లు పొంది రెండవ స్థానంలో నిలిచిన గౌరీ శంకర మఝిలు తలపడుతున్నారు. బీజేడీ మొదటిసారి మహిళ అభ్యర్థిని బరిలో నిలిపింది. కాంగ్రెస్ కూడా యువకుడిని పోటీలో నిలిపింది. ఈసారి నియోజకవర్గ ఓటర్లు ఎవరికి పట్టం కడతారో చూడాలి.

నేడు బొనాకొ లగ్గి

భువనేశ్వర్: పూరీ శ్రీమందిరం రత్న వేదికపై కొలువుదీరిన మూల విరాటులకు శ్రీముఖ సేవ (బొనాకొ లగ్గి) బుధవారం నిర్వహిస్తారు. వైశాఖ కృష్ణ పక్ష అమావాస్య తిథి పురస్కరించుకుని నిర్వహిస్తున్నట్లు దేవస్థానం వర్గాలు తెలిపాయి. మరోవైపు పూరీ రథయాత్ర అనుబంధ ఏర్పాట్లు చేయనున్నారు. త్వరలో జ్యేష్ఠ పూర్ణిమ పురస్కరించుకుని మూల విరాటులకు భారీ స్నానోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో భగవంతుడు అస్వస్థతకు గురవ్వడంతో గోప్య మండపానికి తరలి వెళ్లి భక్తులకు తాత్కాలికంగా కనుమరుగు అవుతాడు. ఈ మేరకు శ్రీమందిరంలో గోప్య మండపం సన్నాహాలు బుధవారం ప్రారంభించనున్నారు. బొనాకొ లగ్గి సేవాదులతో ఈ పనులు చేపట్టేందుకు కార్యక్రమం ఖరారు చేశారు. బుధవారం ద్వితీయ భోగ మండపం తర్వాత బొనాకొ లగ్గితో గోప్య మండపం ఏర్పాట్లు పనులు ప్రారంభిస్తారు. ఈ ప్రక్రియ సుమారు అర్ధరాత్రి 12 గంటల వరకు నిరవధికంగా కొనసాగుతుందని సేవాయత్ వర్గాల సమాచారం. ఈ లెక్కన బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు శ్రీమందిరంలో మూల విరాటుల సర్వ దర్శనం తాత్కాలికంగా నిలిపి వేస్తారని దేవస్థానం అధికార వర్గాలు తెలిపాయి.

పోలింగ్ రోజుల్లో కోర్టులకు సెలవు

భువనేశ్వర్: రాష్ట్రంలో ఎన్నికలు జరిగే రోజుల్లో జిల్లా కోర్టులకు ఒడిశా హైకోర్టు సెలవు ప్రకటించింది. ఈ మేరకు హై కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అన్ని జిల్లాల కోర్టులు, వాటి కార్యాలయాలు సంబంధిత లోక్‌సభ, శాసనసభ నియోజకవర్గాల ఎన్నికల రోజుల్లో మూసివేయబడతాయని ఉత్తర్వుల్లో పేర్కొంది. 2024లోనూ లోక్‌సభ, శాసనసభకు ఎన్నికల దృష్ట్యా పోలింగ్ జరిగే సంబంధిత తేదీల్లో జిల్లా కోర్టులు, వాటి కార్యాలయాలకు ఒడిశా హై కోర్టు సెలవు ప్రకటించింది. భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఒడిశాలోని 147 మంది సభ్యుల శాసనసభ, 21 లోక్‌సభ నియోజకవర్గాలకు ఈనెల 13, 20, 25, జూన్ 1 తేదీల్లో నాలుగు దశల్లో పోలింగ్ జరగనుంది. తొలిదశలో కలహండి, నవరంగ్‌పూర్, బరంపురం, కొరాపుట్ లోక్ సభ నియోజకవర్గాలతో పాటు ఆయా స్థానాల పరిధిలోని శాసనసభ సెగ్మెంట్లలో పోలింగ్ జరగనుంది. బర్‌గఢ్, సుందర్‌గఢ్, బొలంగీర్, కంధమల్, అసికా లోక్‌సభ స్థానాలకు రెండో దశలో పోలింగ్ జరగనుంది. మూడో దశ ఎన్నికల్లో సంబల్‌పూర్, కెంజొహర్, ఢెంకనాల్, కటక్, పూరీ, భువనేశ్వర్ లోక్‌సభ స్థానాల్లో ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంది. మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ నియోజకవర్గాల్లో నాలుగో, చివరి దశ ఎన్నికల్లో పోలింగ్ జరగనుంది.

బీజేడీ తరుపున సినీ హీరో సుమన్ ప్రచారం



జాజిపురం జంక్షన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న సినీ హీరో సుమన్, బీజేడీ అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో అధికార పార్టీ బీజేడీ ప్రజల్లోకి సినీ తారలను ప్రచారానికి దించుతోంది. పర్లాకిమిడి నియోజకవర్గం అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి తరపున తెలుగు సినీ హీరో సుమన్ మంగళవారం సాయంత్రం రామసాగరం నుంచి జాజిపూర్, కత్తలకవిటి, రాసూరు, ఆర్.సీతాపురం, సెంచూరియన్ వర్సిటీ క్యాంపస్ మీదుగా పాటికోట, ఏడోమైలు, గురండి, లావణ్యగడ వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనేకమంది బీజేడీ పార్టీ కార్యకర్తలతో పాటు పర్లాకిమిడి అభ్యర్థి రూపేష్ పాణిగ్రాహి, శాసనం లింగరాజు, జెడ్పీటీసీ బాలరాజు, గుసాని సమితి అధ్యక్షుడు ఎన్.వీర్రాజు పాల్గొన్నారు.

సారా బట్టీలపై పోలీసుల దాడులు



కుర్లి నదీ పరివాహక ప్రాంతంలో గుర్తించిన సారా బట్టీలు

- వెయ్యి లీటర్ల ఇప్ప ఊట, 85 లీటర్ల సారా ధ్వంసం
- ఒకరి అరెస్టు

జయపురం: నాటుసారా తయారీ కేంద్రాలపై జయపురం సబ్‌డివిజన్ కుంద్రా పోలీసులు మంగళవారం దాడులు చేశారు. కుంద్ర సమితిలోని కుర్లి నదీ తీర ప్రాంతాలైన లిమ్మ, కుసుముగుడ పరిసరాల్లో జరిపిన దాడులో సారా బట్టీలను గుర్తించారు. సారా తయారీకి సిద్ధం చేసిన దాదాపు వెయ్యి లీటర్ల ఇప్ప ఊటతో పాటు 85 లీటర్ల సారాను గుర్తించి ధ్వంసం చేశారు. ఒక మోటారుబైక్‌ను స్వాధీనం చేసుసకోవడంతోపాటు ఒకరిని అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఇప్ప ఊట, నాటుసారాను ఎవరికీ కనిపించకుండా డ్రమ్ముల్లో నింపి భూమిలో పాతి పెట్టారు. పోలీసులు అనుమానంతో పరిసర ప్రాంతాలలో గాలించి భూమిలో పాతి పెట్టిన సారా డ్రమ్ములను బయటకు తీశారు. పట్టుబడిన సారా, ఊటను పారబోసినట్టు వెల్లడించారు. సారా డ్రమ్ములతో పాటు వంట సామగ్రిని సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.



భూమిలో పాతిపెట్టిన డ్రమ్ములను బయటకు తీస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న సారా తయారీకి ఉపయోగించే సామగ్రితో పోలీసులు

నాలుగో దశ ఎన్నికల నోటిఫికేషన్ జారీ

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న నాలుగో దశ ఎన్నికలు పురస్కరించుకుని భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) నోటిఫికేషన్ ప్రచురించింది. ఈ దశ పోలింగ్ జూన్ 1న జరుగుతుంది. ఈ విడతలో 7 లోక్‌సభ స్థానాలు, వాటి పరిధిలోని శాసనసభ నియోజకవర్గాల్లో పోలింగ్ నిర్వహించనున్నారు. ఈ నెల 14తో నామినేషన్ల దాఖలకు గడువు ముగుస్తుంది. నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఈ నెల 17గా నిర్ణయించారు. జూన్ 1న మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్ లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఈ నియోజకవర్గాల పరిధిలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ వేళలుగా ప్రకటించారు. రాష్ట్రంలో సమగ్రంగా 4 విడతల్లో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ జరగనుంది. ఈ నెల 13, 20, 25 తేదీలు, జూన్ 1న లోక్ సభ, విధాన సభలకు ఒకేసారి చివరి దశ పోలింగ్ జరగనుంది.

మే 13 తొలి విడత పోలింగ్ జరగనున్న లోక్ సభ నియోజకవర్గాలు
- కలహండి, నవరంగ్‌పూర్, బరంపురం, కొరాపుట్

మే 20 మలి విడత పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు
- బర్‌గఢ్, సుందర్‌గఢ్, బొలంగీర్, కంధమల్, అసికా

మే 25 3వ విడత పోలింగ్ జరగనున్న నియోజకవర్గాలు
- సంబల్‌పూర్, కెంజొహర్, ఢెంకనాల్, పూరి, భువనేశ్వర్, కటక్

జూన్ 1న (చివరి విడత పోలింగ్) జరగనున్న నియోజకవర్గాలు
- మయూర్‌భంజ్, బాలాసోర్, భద్రక్, జాజ్‌పూర్, కేంద్రాపడా, జగత్‌సింగ్‌పూర్

చెరువులో మునిగి ఒకరు మృతి

రాయగడ: జిల్లాలోని శెఖాల్ పోలీస్‌స్టేషన్ పరిధి పితామహల్ గ్రామం శ్రీరాంనగర్ కాలనీలో నివసిస్తున్న రఘునాథ్ తాడంగి (50) అనే వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందారు. సోమవారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం పొలం పనులు చేసుకుని సమీపంలోని చెరువులో స్నానానికి వెళ్లిన అనంతరం నీటిలో మునిగి మృతి చెందారు. చీకటి పడినా రఘునాథ్ ఇంటికి చేరకపోవడంతో కుటుంబీకులు వెతకగా చెరువులో శవమై కనిపించాడు.

హుందాతనం..



బద్రినారాయణ పాత్రోను నమస్కరించిన సౌమ్య రంజన్ పట్నాయక్


భువనేశ్వర్: ఘషిపురా శాసన సభ నియోజకవర్గం నుంచి పోటీ కోసం నామినేషన్ దస్తావేజులు దాఖలు పురస్కరించుకుని ఇరువురు నేతలు బద్రినారాయణ పాత్రో, సౌమ్య రంజన్ పట్నాయక్ యాదృచ్ఛికంగా కలిశారు. ఈ సందర్భంగా వయసుకు తగిన హుందాతనంతో ఒకర్ని ఒకరు పరామర్శించుకుని పరస్పర శుభాకాంక్షలు తెలియజేసుకుని కాసేపు ముచ్చటించుకున్నారు. వాస్తవానికి ఘషిపురా నియోజకవర్గంలో వీరివురు ప్రత్యర్థులుగా బరిలోకి దిగుతున్నారు. నిన్న, మొన్నటి వరకు ఈ ఇద్దరు నేతలు ఒకే గూటి (బిజూ జనతా దళ్) అభ్యర్థులు. సౌమ్యరంజన్ పట్నాయక్‌కు బీజేడీ టికెటు నిరాకరించడంతో స్వతంత్ర అభ్యర్థిగా ఘషిపురా నుంచి నామినేషను దాఖలు చేశారు. ఈ సమయంలో బీజేడీ అభ్యర్థిగా బద్రినారాయణ పాత్రో కూడ ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు బద్రినారాయణ పాత్రోకు సౌమ్యరంజన్ పట్నాయక్ నమస్కరించగా.. కలకాలం బాగుండాలని పెద్దాయన మనసారా ఆశీర్వదించడం నిలువెత్తు సంస్కారానికి అద్దం పట్టింది. రాజకీయ పోటీ వ్యక్తిగత మర్యాదలు, సంస్కారాలకు అడ్డంకి కాలేవని వీరిద్దరూ నిరూపించారు.



సౌమ్య రంజన్ పట్నాయక్‌ను ఆశీర్వదించిన బద్రినారాయణ పాత్రో

ప్రతీ ఓటు అమూల్యం

ఎన్నికల పర్వం దేశానికి గర్వ కారణం (చునావ్ కా పర్వ్ దేశ్ కా గర్వ్) సంకల్పంతో ఈ సైకత శిల్పం రూపుదిద్దుకుంది. భారత ప్రజాస్వామ్యంలో అతిపెద్ద పండగ ఎన్నికలు. ఎన్నికల్లో ప్రతీ ఓటు అమూల్యం. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఓటు వేయండి అనే విజ్ఞప్తితో అంతర్జాతీయ సైకత శిల్పి పద్మశ్రీ సుదర్శన్ పట్నాయక్ పూరి సాగర తీరంలో ఈ సైకత కళాఖండాన్ని ఆవిష్కరించారు.



- భువనేశ్వర్

క్లుప్తంగా

135 కిలోల గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయితో పోలీసులు

కొరాపుట్: గంజాయి అక్రమ రవాణాను కొరాపుట్ జిల్లా పోలీసులు అడ్డుకున్నారు. గంజాయిని రవాణా చేసేందుకు సిద్ధంగా కొంత మంది ఉంచారని కొరాపుట్ జిల్లా పొట్టంగి పోలీస్ స్టేషన్‌కి విశ్వసనీయ సమాచారం వచ్చింది. దళపతిగూడలో గంజాయి ఉన్నట్టు తెలిపారు. దీంతో సుంకి, పొట్టంగి పోలీసులు సంయుక్తంగా గాలింపులు చేపట్టారు. పోలీసులు రాక చూసి స్మగ్లర్లు పరారయ్యారు. ఆ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ వద్ద తరలించడానికి సిద్ధంగా ఉన్న 135 కిలోల గంజాయిని పోలీసులు గుర్తించారు. దీన్ని మెజిస్ట్రేట్ సమక్షంలో సీజ్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. నాలుగు లక్షలు ఉంటుందని పోలీసులు ప్రకటించారు. పరారైన స్మగ్లర్ల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

పర్యవేక్షకుల నియామకం

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని ఎన్నికల సంఘం ఖుర్దా జిల్లాకు సాధారణ, పోలీసు పర్యవేక్షకుల్ని నియమించింది. ఈ జిల్లా పరిధిలో భువనేశ్వర్ లోక్‌సభ స్థానం, జయదేవ్ (ఎస్సీ), భువనేశ్వర్ (కేంద్ర), భువనేశ్వర్ (ఉత్తర), ఏకామ్ర భువనేశ్వర్, జట్నీ, బెగునియా, ఖుర్దా, చిలికా శాసనసభ నియోజకవర్గాలకు పర్యవేక్షకుల జాబితా విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఫిర్యాదులు, అభియోగాలు అనుబంధ పర్యవేక్షకులకు దాఖలు చేయాలని ఎన్నికల సంఘం పేర్కొంది. ఖుర్దా జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలకు యారం నాగి రెడ్డి, ఐపీఎస్ పోలీసు పర్యవేక్షకునిగా నియమితులయ్యారు. ఆయనతో సంప్రదింపుల కోసం ఎన్నికల సంఘం 93488 23290 ఫోన్ నంబర్ జారీ చేసింది.

ప్రశాంతంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్



విక్రమదేవ్ విశ్వవిద్యాలయంలో ఓటు వేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు

జయపురం: ఈ నెల 13వ తేదీన జరగనున్న సాధారణ ఎన్నకల్లో విధులు నిర్వహించే ప్రభుత్వ ఉద్యోగులు స్థానిక విక్రమదేవ్ విశ్వవిద్యాలయం, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రాంగణాల్లో నిర్వహిస్తున్న శిక్షణ కేంద్రాల్లో బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 847 మంది ఉద్యోగులు ఓటు వేశారు. కొరాపుట్ లోక్‌సభ నియోజకవర్గంలో 766 మంది, నవరంగపూర్ లోక్‌సభ నియోజకవర్గంలో 81 మంది ఓట్లు వేశారు. కొరాపుట్ విధానసభలో 242 మంది, జయపురం నియోజకవర్గంలో 234 మంది, కొట్‌పాడ్ నియోజకవర్గంలో 81 మంది, పొట్టంగి నియోజకవర్గంలో 170 మంది, లక్ష్మీపూర్ నియోజకవర్గంలో 120 మంది బ్యాలెట్ ద్వారా ఓట్లు వేశారని తెలిసింది. ఓట్లను సీజ్ చేసి భద్రపరచారు.

తత్కాల్ ద్వారా ఇంటర్ పరీక్ష ఫీజు స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: వివిధ కారణాలతో ఇంటర్మీడియెట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ పరీక్ష ఫీజు చెల్లించలేని విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తమ మార్కులను పెంచుకునేందుకు/ఉత్తీర్ణతకానీ సబ్జెక్టుల్లో పరీక్ష రాసేందుకు తత్కాల్ స్కీమ్ కింద ఈ నెల 8 నుంచి 10వ తేదీ మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించవచ్చు. రూ.3వేల అపరాధ రుసుంతోపాటు పరీక్ష ఫీజులను యధావిధిగా చెల్లించాల్సి ఉంటుందని ఇంటర్‌బోర్డు స్పష్టంచేసింది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఆర్ఐఓ ప్రగడ దుర్గారావు కోరారు. ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు చొరవ తీసుకుని శతశాతం ఫీజులు చెల్లించేలా చూడాలన్నారు.

ప్రమాదంలో గాయపడిన రిక్షా తాత మృతి



మృతదేహం వద్ద హెచ్‌సీ వెంకటరమణ

శ్రీకాకుళం క్రైమ్ : గత నెల 28న రెండోసారి రోడ్డు ప్రమాదానికి గురైన రిక్షా తాత కంతా రామారావు విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. రిక్షానే ఆవాసంగా మార్చుకున్న రామారావు గతంలో ఓసారి ప్రమాదానికి గురైతే ట్రాఫిక్ పోలీసులు ఆదుకుని దాతల సాయంతో రిక్షా అందజేసిన సంగతి తెలిసిందే. తర్వాత మళ్లీ గాయపడటంతో కేజీహెచ్‌లో చేర్పించారు. మంగళవారం ట్రాఫిక్ హెచ్‌సీ వెంకటరమణ, పీసీ నరేష్‌లు కేజీహెచ్‌లో వృద్ధుని మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బూర్జలో ఉంటున్న సోదరుడు కాంతారావు, సోదరి లక్ష్మిలకు అప్పగించారు.

మళ్లీ బీజేడీదే అధికారం

● మంత్రి అతాన్ సవ్యసాచి నాయక్



మాట్లాడుతున్న మంత్రి నాయక్, పక్కనే నెక్కంటి, కృష్ణ మహాపాత్రో, అనసూయా మాఝి

రాయగడ: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఈసారి కూడా రాష్ట్రంలో బీజేడీ పార్టీ అధికారంలోకి రానుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, రాయగడ జిల్లా ఎన్నికల పరిశీలకులు అతాన్ సవ్యసాచి నాయక్ జోస్యం చెప్పారు. స్థానిక బీజేడీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ప్రతిచోటా ప్రజాదారణతో పాటు పార్టీ కార్యకర్తలు, నాయకులు విస్తృతంగా ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ముఖ్యంగా రాయగడ జిల్లాలో గల గుణుపూర్, రాయగడ, బిసంకటక్ శాసనసభలతోపాటు కొరాపుట్ లోక్‌సభ స్థానాల్లో కూడా తమ పార్టీ అభ్యర్థులు అధిక మెజార్టీతో గెలుపొందే అవకాశం ఉందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

ప్రజలు మెచ్చిన పథకాలు .

ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాలు ప్రజలు మెచ్చినవి కావడంతో బీజేడీ పాలనపై నమ్మకం ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రజల బాగోగులతో పాటు వారికి సుస్థిర పాలనను అందించే ఏకైక పార్టీగా బీజేడీ ఆవిర్భవించిందన్నారు. సంక్షేమ పథకాలే పార్టీ విజయానికి నాంది పలుకుతున్నాయన్నారు. ముఖ్యంగా రాష్ట్రంలో మహిళల ఆర్థిక అభివృద్ధికి అమలు చేసిన మిషన్ శక్తి, స్వయం సహాయక బృందాలు, మమత తదితర పథకాలు విజయవంతం కావడంతో బీజేడీకి ఆదరణ పెరిగిందన్నారు. దానికి అనుగుణంగా వారికి అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తుండటం పార్టీ అభివృద్ధికి మరో మైలు రాయిగా నిలిచిందన్నారు.

విభేదాలు లేవు..

పార్టీలో ఎటువంటి వ్యక్తిగత విభేదాలు లేవని, అందరూ కలిసి పార్టీ విజయానికి కృషి చేస్తున్నారని ఒక ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పారు. జిల్లాలో నెక్కంటి భాస్కరరావు, కృష్ణ మహాపాత్రో వంటి సీనియర్ నాయకులు పార్టీ విజయానికి నిరంతరం పని చేస్తున్నారన్నారు. వారి నాయకత్వంలో పార్టీ మరింత అభివృద్ధి చెందిందని కొనియాడారు. ఈ సమావేశంలో రాయగడ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న అనసూయా మాఝి, బీజేడీ రాష్ట్ర శాఖ ఉపాధ్యక్షుడు జగదీష్ పాత్రో తదితరులు పాల్గొన్నారు. .

భీకర గాలులు-నేలకొరిగిన చెట్లు



దండుమాలవీధి వద్ద పడిపోయిన చెట్టును తొలగిస్తున్న సిబ్బంది



పర్లాకిమిడి - కాశీనగర్ రోడ్డులో రోడ్డుకు అడ్డంగా కూలిన భారీ వృక్షం

పర్లాకిమిడి: అల్పపీడన ద్రోణి ప్రభావంతో పర్లాకిమిడి, కాశీనగర్ సమితిల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. భీకర గాలులతో భారీ వృక్షాలు పలుచోట్ల నేలకొరిగాయి. సోమవారం సాయంత్రం నుండి రాత్రి వరకూ కురిసిన పెనుగాలి వర్షానికి డోలా ట్యాంకు రోడ్డులో దండుమాలవీధి చర్చి వద్ద రెండు చెట్లు విరిగిపడ్డాయి. కాశీనగర్ సమితి సిద్ధమణుగు గ్రామంలో పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో పర్లాకిమిడి, గుణుపురం, రాయగడ, కోరాపుట్‌కు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. చెట్లను జిల్లా ప్రకృతి వైపరీత్యాల నివారణ సిబ్బంది తొలగించి రోడ్డును క్లియర్ చేశారు. పెనుగాలులకు పర్లాకిమిడిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

కాంగ్రెస్‌లోకి బీజేపీ నాయకుడు దాస్ భోత్ర



దాస్ భోత్రను అక్కున చేర్చుకున్న ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి

జయపురం: బొరిగుమ్మ సమితి మాజీ సభ్యుడు, బీజేపీ సీనియర్ నేత దాస్ భోత్ర మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బొరిగుమ్మలో గల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో దాస్ భోత్రను జయపురం నియోజకవర్గ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి తారాప్రసాద్ బాహిణీపతి సాదరంగా ఆహ్వానించారు. భోత్రకు నువాగుడ, పాతబొరిగుమ్మ, జిలిమిలి, ఖుడిగుడ తదితర గ్రామాల్లో మంచి పేరున్న నాయకుడని, అతడి వెంట వందలాది మంది కార్యకర్తలు ఉన్నారని, అతడి పట్ల భోత్ర సంప్రదాయ ప్రజలకు ఆదరణ ఉందని, కాంగ్రెస్‌లో కలవటం వల్ల తమ పార్టీకి మేలు కలుగుతుందని కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి దేవేంద్ర బాహిణీపతి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా తాను బీజేపీలో ఉంటూ బొరిగుమ్మలో ఆ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేశానని, కొంత కాలంగా బీజేపీ తనను విస్మరించిందని దాస్ ఆరోపించారు. ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి బొరిగుమ్మ సమితిలో శాంతిభద్రతలు పరిరక్షించేందుకు, సారా ప్రవాహాన్ని అరికట్టేందుకు చేపట్టి ఉద్యమాలకు, సమితి అభివృద్ధికి చేసిన కృషి తనను ఆకర్షించడంతో కాంగ్రెస్‌లో చేరినట్టు వెల్లడించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ ఏఈ, అకౌంట్స్ అధికారి సస్పెన్షన్

అరసవల్లి: లావేరు మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో అక్రమాలకు పాల్పడిన ఇద్దరు విద్యుత్ శాఖాధికారులపై ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు కొరఢా ఝులిపించారు. లావేరులో అప్పట్లో ఏఈగా పనిచేసిన తంగుడు వెంకట రమణమూర్తి (ప్రస్తుతం మెళియాపుట్టి ఏఈ), అప్పట్లో శ్రీకాకుళం ఈఆర్వో విభాగంలో ఏఏఓగా పనిచేసిన పి.ప్రభాకరరావు (ప్రస్తుతం విశాఖ కార్పొరేట్ కార్యాలయం ఏఓ) లను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీఎండీ పృథ్వీతేజ్ ఉత్తర్వులు జారీ చేశారు. 2022-23లో లావేరు మండలంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరులో పలు అక్రమాలకు పాల్పడినట్లుగా అందిన ఫిర్యాదుల మేరకు జరిపిన విచారణలో వీరిద్దరి పాత్రను నిర్ధారిస్తూ సస్పెన్షన్ వేటు విధించారు. వ్యవసాయదారులకు చెందిన పాత కనెక్షన్ల పేర్లు మార్చి కొత్తవారికి డబ్బులు తీసుకుని కనెక్షన్లు కేటాయించారనే విషయంలో అప్పట్లో 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు కథనాలతో పాటు బాధిత రైతుల లిఖిత పూర్వక ఫిర్యాదుల మేరకు చర్యలు చేపట్టారు. ఈ సస్పెన్షన్లను సర్కిల్ ఎస్ఈ ఎన్.కృష్ణమూర్తి ధృవీకరించారు.

రణస్థలం మండలంలోనూ విజిలెన్స్..

లావేరులో అక్రమాలపై చర్యలు చేపట్టిన క్రమంలో రణస్థలం నుంచి కూడా సీఎండీ కార్యాలయానికి పలు ఫిర్యాదులు చేరినట్లు సమాచారం. ఇక్కడ కూడా పలువురి వ్యవసాయ కనెక్షన్ల మంజూరుకు రూ.వేలల్లో లంచాలు వసూలు చేస్తున్నట్లుగా, స్థానిక స్టోర్స్‌లో ఉన్న విలువైన విద్యుత్ కేబుళ్లు, ఏబీ స్విచ్‌లు, ఇతర సామగ్రిని చోరీ చేయిస్తూ ఓ అధికారే తన మనుషులతో బయట వ్యాపారులకు విక్రయిస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయి. దీనిపై విజిలెన్స్ అధికారులతో పాటు శాఖాపరంగా కూడా ప్రస్తుతం విచారణ జరుగుతున్నట్లు అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మద్యం బాటిళ్ల స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని ఎస్ఎంపురంలో అక్రమంగా తరలిస్తున్న 40 మద్యం బాటిళ్లను మంగళవారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బాటిళ్లు తరలిస్తున్న ముద్దాడ సూర్యనారాయణపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో ఇన్‌స్పెక్టర్ ఎం.వి.గోపాలకృష్ణ, ఇంటెలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ శంకరరావు, ఎస్ఐ మాధవి పాల్గొన్నారు.

10లోపు ఉచిత సీట్లలో చేరాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్/ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఉచిత అడ్మిషన్లు లభించిన విద్యార్థులను ఈ నెల 10లోపు ఎంపికైన స్కూల్లో చేర్పించాల్సి ఉంటుందని సమగ్రశిక్ష శ్రీకాకుళం జిల్లా అదనపు ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ (ఏపీసీ) డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. మంగళవారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్ట్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాల కోసం 3,185 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్టు చెప్పారు. మొదటి దశలో 796 మందిని పాఠశాల విద్య ఉన్నతాధికారులు తగు అర్హతలు ఆధారంగా ఎంపిక చేసినట్టు పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల సమాచారాన్ని తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా చేరవేసినట్టు తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా పొందుపర్చినట్టు చెప్పారు. ఈ నెల 10లోపు విద్యార్థులను పాఠశాలల్లో చేర్చాలని కోరారు. సంబంధిత ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల వద్ద నుంచి అదనపు ఫీజులు వసూలు చేయడానికి వీల్లేదని స్పష్టంచేశారు. ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం ప్రకారం అడ్మిషన్లు పూర్తి చేసిన విద్యార్థుల వివరాలతో రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు.

చిట్ నిర్వాహకురాలిని నిలదీసిన బాధితులు



మహిళను ముట్టడించిన బాధితులు

టెక్కలి రూరల్: డబ్బులు చెల్లించకుండా పరారైన చిట్ నిర్వాహకురాలిని బాధితులు ముట్టడించిన ఘటన టెక్కలిలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ప్రకారం.. టెక్కలి రోటరీనగర్-1లో నివాసముంటున్న మాగాపు సబితాదేవి కొన్నేళ్లు చిట్ ఫండ్ వ్యాపారం చేసి గత ఏడాది రూ.3 కోట్లతో పరారైంది. అప్పటి నుంచి సుమారు 175 మంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటి వరకు 17 మందికి ఐపీ నోటీస్‌లు ఇచ్చినట్లు సమాచారం. ఆమె హైదరాబాద్‌లో ఉన్నట్లు తెలియడంతో బాధితులు ఏంచెయ్యలేని స్థితిలో ఉండిపోయారు. చివరకు మంగళవారం టెక్కలి రోటరినగర్-1 సమీపంలోని ఓ బ్యాంకుకు రహస్యంగా రావడం గుర్తించిన స్థానికులు బాధితులకు సమాచారం అందించగా అందరూ చేరుకుని నిలదీశారు. కొందరు ఆమె మెడలో ఉన్న వస్తువులు సైతం లాగేసినట్లు తెలిసింది. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి బెయిల్‌పై విడుదల చేశారు.

నేటితో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ పూర్తి

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. మంగళవారం 131 మంది ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఇప్పటి వరకు 1736 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. బుధవారంతో ఓటింగ్ ముగియనుంది. జిల్లా ఉపాధి కల్పనాధికారి సుధ, తహశీల్దార్ లక్ష్మి ఎన్నికల ప్రక్రియ పర్యవేక్షించారు.

ఈదురుగాలుల బీభత్సం



హిరమండలం: అవలంగిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభం



బూర్జ: రోడ్డుపై విరిగిన చెట్టు కొమ్మలు



ఎచ్చెర్ల క్యాంపస్: మృతి చెందిన పాడి ఆవులు

హిరమండలం: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గాలుల ధాటికి అవలంగి పాఠశాల వద్ద విద్యుత్ స్తంభం నేలకొరిగింది. పలు గ్రామాల్లో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఎచ్చెర్ల క్యాంపస్: కుప్పిలి గ్రామంలో పశువుల పాకపై సోమవారం అర్ధరాత్రి పిడుగు పడింది. దీంతో అలుపున సీతయ్యకు చెందిన మూడు పాడి ఆవులు మృతి చెందాయి. పాలు అమ్మకం ద్వారా జీవనం సాగిస్తున్న ఈ కుటుంబానికి ఒక్కసారి రూ.రెండు లక్షలు వరకు నష్టం వాటిల్లడంతో బాధితులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

బూర్జ: మండలంలో మంగళవారం ఉరుములు, పిడుగులతో కూడిన వర్షం కురిసింది. పలుచోట్ల చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి.

ప్రచార వాహనాలకు అనుమతి తప్పనిసరి



ఖర్చుల వివరాలు పరిశీలిస్తున్న అధికారులు

● ఎన్నికల పరిశీలకులు చంద్రికా గార్గ్

పర్లాకిమిడి: ఎన్నికల ప్రచారానికి వినియోగించే వాహనాలు, మైకుల కోసం అధికారుల నుంచి విధిగా అనుమతి తీసుకోవాలని గంజాం, గజపతి జిల్లాల ఎన్నికల ఖర్చు పరిశీలకుడు చంద్రికా గార్గ్ స్పష్టం చేశారు. స్థానిక కలెక్టరేట్‌లో పర్లాకిమిడి, మోహనా, దిగపోహండి నియోజికవర్గాల అభ్యర్థులకు చెందిన ఎన్నికల ఖర్చుల రిజిష్టరు, ఖాతాలను మంగళవారం పరిశీలించారు. ఆమెతో పాటు జిల్లా ఎన్నికల అధికారి స్మృతిరంజన్ ప్రధాన్, డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్, ఇతర ఎన్నికల సిబ్బంది ఈనెల ఒకటి నుంచి ఏడో తేదీ వరకూ జరిగిన అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల సహాయ అధికారి గుణనిధి నాయక్ మాట్లాడుతూ.. అభ్యర్థులు ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా మైక్ సౌండింగ్ ప్రచారంలో వాడుకుంటున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాహనాల కోసం విధిగా ఆన్‌లైన్‌లో రిజిష్టరు చేసుకొని ఎన్నికల అధికారుల అనుమతి పొందాలన్నారు. వాహనాల ఖర్చుల వివరాలను అభ్యర్థుల తరఫున ఏజెంట్లు విధిగా పొందుపరచాలని సూచించారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి ప్రభుదాన్ భోత్ర



డాక్టర్ పరేష్‌రథ్‌ను సన్మానిస్తున్న అతిథులు



కవితా సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

జయపురం: రచయిత, పాత్రికేయులు, ఆశుకవి, విద్యాదాత, సమాజ సేవకుడు స్వర్గీయ ప్రభుదాన్ భోత్ర బహుముఖ ప్రజ్ఞాశాలి అని వక్తలు కొనియాడారు. స్థానిక జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రంలో ప్రభుదాన్ భోత్ర 92వ జన్మదినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ముఖ్యవక్తగా పాల్గొన్న ప్రమెయ ఒడియా దినపత్రిక జయపురం ఎడిషన్ మేనేజర్ ప్రకాశ్‌చంద్ర దాస్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుదాన్ భోత్ర కేవలం పాత్రికేయులే కాదని.. ఉపాంత ప్రహరి వార్తా పత్రికను అవిభక్త కొరాపుట్ ప్రజలకు దశాబ్దాలపాటు అందించిన వ్యక్తి అన్నారు. డీఏవీ మోడల్ సెకండరీ స్కూళ్లను పలు ప్రాంతాల్లో ప్రారంభించి విద్యాదాతగా నిలిచారన్నారు. అలాగే ఏఎస్ఎం శిక్షణ కేంద్రాలను ప్రారంభించి అవిభక్త కొరాపుట్ యువతలకే కాకుండా పలు జిల్లాల వేలాదిమంది యువతులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించి సమాజ సేవకుడిగా నిలిచారని వివరించారు. పాత్రికేయుడు, రచయిత, పరిశోధకులు డాక్టర్ పరేష్ రథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యావేత్త ప్రదీప్‌కుమార్ మిశ్ర, డాక్టర్ ప్రామోదిని హోత్త, జిల్లా ఉపాధ్యాయ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ రూపచంద్ర సోరెన్, అధ్యాపకులు డాక్టర్ శుధాంశు శేఖర పట్నాయక్, కృష్ణచంద్ర హోత్త ప్రసంగించారు. కార్యక్రమంలో ప్రభుధాన్ భోత్ర స్మృతి సంసద్ కార్యదర్శి ప్రకాశ్ మహానందియ సంసధ్ వార్షిక కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా 'దూయి పద అగరె' (రెండు మాటలు ముందు) అనే పుస్తకాన్ని 'దినకియె వార్తటియె' కవితా సంకలనాన్ని' అతిథులు ఆవిష్కరించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పరేష్‌రథ్ ను 'ప్రభుదాన్ భోత్ర స్మృతి సమ్మాన్ 2024'తో సన్మానించారు.

నిర్భయంగా ఓటేయండి



భువనేశ్వర్: గొడిసాగొడా ఠాణా పరిధి వీధిలో పోలీసుల కవాతు



జయపురం: ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

జయపురం: ఒడిశాలో మొదటి విడత ఎన్నికలు ఈ నెల 13 వ తేదీన జరుగుతున్నాయి. ఎన్నికల శాంతియుతంగా జరిపేందుకు కొరాపుట్ జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టింది. ప్రజలు నిర్భయంగా ఓటు వేసేందుకు అధికారులు తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. కొరాపుట్‌లో మంగళవారం నిర్వహించిన ఫ్లాగ్‌మార్చ్‌లో జిల్లా కలెక్టర్ వి.కార్తివాసన్, జిల్లా ఎస్పీ అభినవ సోన్‌కర్ పాల్గొన్నారు. జగన్నాథ్ మందిర కూడలి, పారజ సాహి, హైస్కూల్ జంక్షన్, పోలీస్ ప్రధాన కార్యాలయం తదితర ప్రాంతాల్లో కవాతు నిర్వహించారు. కొరాపుట్ సబ్‌డివిజన్ పోలీసు అధికారి శ్రీవాణి నాయక్, పట్టణ పోలీస్ అధికారి ప్రమోద్ నాయిక్, పలువురు పోలీసులు, బీఎస్ఎఫ్ జవాన్‌లు పాల్గొన్నారు.

పూరీలో పోలీస్ కవాతు..

భువనేశ్వర్: సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని పూరీ లోక్ సభ నియోజకవర్గంలో స్వల్ప ఉద్రిక్త పరిస్థితులు తలెత్తుతున్నాయి. సమస్యాత్మక ప్రాంతాల్లో పోలీసులు పహారా నిర్వహిస్తున్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వేసేందుకు రక్షణ కల్పించే బాధ్యత మాది అనే చైతన్య నినాదంతో పూరీ మారుమూల వీధుల్లో పోలీసు కవాతు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా గొడిసాగొడా ఠాణా పరిధిలో వివిధ గ్రామాల్లో ఫుట్ పెట్రోలింగ్ ముమ్మరం చేశారు.

నకిలీ అభ్యర్థి అరెస్ట్

● నీట్ పరీక్షలో నికిలీ అభ్యర్థితోపాటు మరో ఇద్దరిని కోర్టుకు తరలింపు
● పరారీలో మరో ముగ్గురు నిందితులు

భువనేశ్వర్: భద్రక్ జిల్లాలో నీట్ పరీక్షలో వంచనకు పాల్పడిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. ఈ మోసం కేసులో ప్రమేయం ఉన్న మరో ఇద్దరి కూడా అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు భద్రక్ సబ్ డివిజనల్ పోలీసు అధికారి సౌరవ్ ఓతా మంగళవారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారు. త్వరలోనే వారిని అరెస్టు చేస్తామని తెలిపారు. ఈ నెల 5వ తేదీన భద్రక్‌లో ఎస్‌బీడీ ఇంటర్నేషనల్ ప్రైవేట్ స్కూల్‌లో నీట్ పరీక్ష జరుగుతుండగా మోసగాడిని పట్టుకున్నారు. పరీక్ష సందర్భంగా అధికారులు నకిలీ అభ్యర్థిగా అనుమానించి అడ్మినిస్ట్రేటివ్ అధికారికి సమాచారం అందించారు. వెరిఫికేషన్ సమయంలో అడ్మిట్ కార్డుపై నకిలీ పరీక్షకుడి ఫొటో ఉన్నట్లు సెంటర్ సిబ్బంది గుర్తించారు. ఆధార్ కార్డ్ వెరిఫికేషన్ సమయంలో అతని వేలిముద్ర సరిపోలలేదు. దీంతో అనుమానం పూర్తిగా బలపడింది. కేంద్రం సూపరింటెండెంట్ వెంటనే పోలీసులకు సమాచారం అందించి బృందంగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. విచారణలో మయూర్‌భంజ్‌కు చెందిన శాస్వత్ త్రిపాఠి పరీక్షకు హాజరుకావలసిన వాస్తవ అభ్యర్థిగా పోలీసులు గుర్తించారు. కోల్‌కతాకు చెందిన అంకిత్ రాజ్ అనే 3వ సంవత్సరపు ఎంబీబీఎస్ వైద్య విద్యార్థి శాస్వత్ త్రిపాఠి వలె అనుకరిస్తూ పరీక్షకు హాజరయ్యాడని భద్రక్ ఎస్‌డీపీఓ సౌరవ్ ఓతా తెలిపారు. ఈ వ్యవహారం కోసం రూ.10 లక్షలకు నిందితుడు ఒప్పందం కుదుర్చుకున్నాడు. మరో ఇద్దరు ఆదిత్య కుమార్, రాజేష్ మధుకర్ ఈ వ్యవహారంలో మధ్యవర్తులుగా వ్యవహరించారు. పోలీసులు బీహార్‌కు చెందిన మోసగాడు అంకిత్ రాజ్‌తో మధ్యవర్తులుగా వ్యవహరించిన రాజేష్ మధుకర్ (బీహార్), ప్రేమ్ శంకర్ పాండే (జార్ఖండ్)ని అరెస్టు చేశారు. వారి నుంచి అడ్మిట్ కార్డు, మూడు మొబైల్ ఫోన్లు, కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఎన్నికల కంట్రోల్ రూమ్ పరిశీలన



కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికలు పురస్కరించుకుని తొలి విడత పోలింగ్ సమీపిస్తోంది. ఈ తరుణంలో ఎన్నికల నిర్వహణ, నియంత్రణ, పర్యవేక్షణ కార్యకలాపాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల పర్యవేక్షకుడు యోగేంద్ర త్రిపాఠి (మాజీ ఐఏఎస్), పోలీసు పర్యవేక్షకుడు రంజినికాంత మిశ్రా (మాజీ ఐపీఎస్), వ్యయ పరిశీలకురాలు హిమాలినీ కశ్యప్ (మాజీ ఐఆర్ఎస్) బృందం రాష్ట్ర స్థాయిలో నియంత్రణ కార్యకలాపాల కోసం ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ కార్యాలయంలో వాస్తవ పనితీరు, కచ్చితమైన ఏర్పాట్లను పర్యవేక్షించినట్లు తెలిపారు. ఈ కంట్రోల్ రూమ్ స్థానిక రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సీఈఓ కార్యాలయంలో పని చేస్తుంది.

క్లుప్తంగా

నేడు ఎస్వీ డిగ్రీ కళాశాలకు ముగ్గురు కమిటీ సభ్యులరాక


ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలోగల శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీకళాశాలకు రాష్ట్ర కాలేజీయేట్ కమిషనర్ డాక్టర్ పోల.భాస్కర్ ఆదేశాల మేరకు త్రిసభ్య కమిటీసభ్యులు బుధవారం వస్తున్నట్లు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల చలపతిరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తమ కళాశాలకు నాక్ (జాతీయగుర్తింపు నిర్ధారణచేసే కౌన్సిల్) బృందం ఆగస్టు లేదా సెప్టెంబర్ నెలలో రానున్నందున ముందస్తుగా ఉన్నత విద్యాశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు అమరావతి నుంచి డాక్టర్ కె.విజయ్‌బాబు (ఓఎస్డీ), డాక్టర్ జె. జాన్‌కిరణ్ (అకడమిక్ ఆఫీసర్), ఈ.వరప్రసాద్(అకడమిక్ ఆఫీసర్)లు కళాశాలకు వస్తున్నట్లు తెలిపారు. వీరు కళాశాలను సందర్శించి నాక్ కమిటీ వచ్చే సమయానికి చేయాల్సిన పనులు, రికార్డులు, అకడమిక్ విధానం, విద్యాప్రమాణాలు పెంచేందుకు తగు సూచనలు, కళాశాలలో మెరుగు పరచాల్సిన పలుఅంశాలు, అకడమిక్ కార్యకలాపాల మెరుగుకు సూచనలు, సలహాలను అందిస్తారని తెలిపారు. కళాశాలలో బోధన సిబ్బందితో మాట్లాడి బోధనలో తీసుకోవాల్సిన అంశాలపై వివరిస్తారని తెలిపారు.

రిసెప్షన్ సెంటర్ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి


లెండి ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

విజయనగరం అర్బన్: రిసెప్షన్ సెంటర్ల వద్ద పక్కాగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జిల్లా సాధారణ ఎన్నికల పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, ఎస్పీ దీపికతో కలిసి డెంకాడ మండలంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్న రిసెప్షన్ సెంటర్‌ను మంగళవారం పరిశీలించారు. రిసెప్షన్ సెంటర్లు, స్ట్రాంగ్‌రూమ్‌లు, బారికేడింగ్, పార్కింగ్, భోజన ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. లెండి కళాశాలలో రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, ఎస్.కోట నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు జరుగుతుందని.. ఎక్కడా లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ అనంతరం ఈవీఎంలను తీసుకువచ్చే అధికారులు, సిబ్బంది రాకపోకలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా కౌంటర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. బస్సులు, అధికారుల వాహనాలు లోపలికి రావడానికి, సిబ్బందిని దించి బయటకు వెళ్లడానికి వీలుగా మార్గాలను ఏర్పాటు చేయాలన్నారు. సిబ్బంది ఈవీఎంలతో లోపలికి వచ్చిన దగ్గర నుంచి.. తమకు కేటాయించబడిన కౌంటర్లకు సులువుగా చేరుకునేలా నేమ్‌బోర్డులు, డైరెక్షన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద పటిష్టమైన భద్రత ఏర్పాటు చేయాలని చెప్పారు. పర్యటనలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఆర్‌డీఏ ఎస్‌డీ అనిత, రిసెప్షన్ సెంటర్ నోడల్ అధికారులు మెప్మా పీడీ ఎం.సుధాకరరావు, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ శ్రీధర్‌రాజు, డీఎంఅండ్‌హెచ్‌ఓ భాస్కరరావు, డీఎస్‌ఓ మధుసూదనరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ లక్ష్మణరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ విజయలక్ష్మి, రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల్లో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకం

- సాధారణ పరిశీలకుడు ప్రమోద్‌కుమార్ మెహర్దా

పార్వతీపురం: సాధారణ ఎన్నికలు స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహించడంలో సూక్ష్మ పరిశీలకుల పాత్ర కీలకమని ఎన్నికల సాధారణ పరిశీలకుడు ప్రమోద్ కుమార్ మెహర్దా అన్నారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో సూక్ష్మ పరిశీలకులకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని మంగళవారం ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ రహస్యంగా, ప్రశాంతంగా జరగాలని, ఓటరు మినహా పోలింగ్ కేంద్రాలలోకి ఎవరినీ అనుమతించరాదని చెప్పారు. పోలింగ్ జరిగిన చోట ఎక్కడైనా హింసాత్మక ఘటనలు జరిగితే ప్రిసైడింగ్ అధికారి, పోలీస్ సిబ్బందికి సమాచారం అందించాలని సూచించారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలో ప్రచారం చేయడం నిషేధమని పేర్కొన్నారు. నియమించిన పోలింగ్ ఏజెంట్లు ఉదయం 5గంటలకు పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు.

ఆంజనేయస్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఆంజనేయస్వామికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ రకాల ఫల రసాలతో విశేష అర్చనలు చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

వృత్తిదారుల మోములో ఆనందం...


జగనన్న చేదోడు చెక్కును లబ్ధిదారులకు అందజేస్తున్న అధికారులు (ఫైల్)

- నాయీ బ్రాహ్మణులు, రజకులు, టైలర్లకు అండగా నిలిచిన 'జగనన్న చేదోడు'
- ఏటా రూ. పది వేల ఆర్థిక సాయం
- జిల్లాలో నాలుగు విడతల్లో 63,808 మందికి రూ. 63.80 కోట్ల సాయం
- టీడీపీ హయాంలో వృత్తిదారులకు మొండిచేయి
- జగనన్న ప్రభుత్వంలో వృత్తిదారులకు దక్కిన గౌరవం

విజయనగరం ఫూల్‌బాగ్: చేతి వృత్తిదారుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగింది. 21 నుంచి 60 సంవత్సరాల వయస్సుండి సొంత షాపు కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ చేదోడు పథకాన్ని అమలు చేశారు. ఈ పథకం కింద అర్హత కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు ఏడాదికి రూ. పది వేల చొప్పున ఆర్థిక సాయం అందించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు నాలుగు విడతల సాయం అందింది. లబ్ధిదారులతో దరఖాస్తు చేయించడంలో వలంటీర్లు, ఈకేవైసీ చేయించడంలో సచివాలయ సిబ్బంది కీలకపాత్ర పోషించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో లబ్ధిదారులు వారికి కావాల్సిన పనిముట్లు, సామగ్రి కొనుగోలు చేసుకుని ఆర్థికంగా స్థిరపడ్డారు.

వృత్తిదారులకు అండగా...

జగనన్న ప్రభుత్వం ఏటా ఇచ్చే రూ.10 వేలను రజకులు, టైలర్లు, నాయీ బ్రాహ్మణులు సద్వినియోగం చేసుకుంటున్నారు. వారి వత్తికి సంబంధించిన వస్తువుల కొనుగోలు, షాపు అద్దెలు, విద్యుత్ బిల్లులకు ఖర్చు చేసుకుంటూ ఆనందంగా జీవిస్తున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఏటా క్రమం తప్పకుండా ఆర్థిక సాయం అందించడంపై ఆయా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

జగనన్న చేదోడు లబ్ధిదారులు వివరాలు

సంవత్సరం	లబ్ధిదారులు	అందిన మొత్తం (రూ.కోట్లలో)
2020-21	16,359	రూ.16.35
2021-22	13,311	రూ.13.31
2022-23	17,245	రూ.17.24
2023-24	16,893	రూ.16.89
	63,808	రూ.63.80 కోట్లు (సుమారు)

మాకు అండగా నిలుస్తున్నారు..



ప్రజా సంకల్పయాత్రలో మా కష్టాలను అప్పటి ప్రతిపక్ష నేత జగన్ మోహన్‌రెడ్డికి విన్నవించుకున్నాం. ఆనాడే ఆయన మాకు మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు నాకు రూ. 40 వేలు జమ చేశారు. చంద్రబాబు మాకు గతంలో ఏ రకమైన సాయం చేయలేదు. వచ్చే ఎన్నికల్లో జగన్‌ను సీఎంగా గెలిపించుకుంటాం.

– పొంతపల్లి పాపారావు, టైలర్, నెల్లిమర్ల

రుణపడి ఉంటాను..



రజక కులవత్తి చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్నాను. సామాగ్రి కొనుగోలు చేయడానికి ఆర్థిక స్తోమత లేక చాలా ఇబ్బందులు పడేవాడ్ని. గతంలో మాకు ఆర్థిక సాయం చేసిన ప్రభుత్వాలు లేవు. మాలాంటి పేదల కష్టాలను తెలుసుకున్న జగన్‌బాబు ప్రతి ఏటా రూ. 10 వేలు మాకు అందించారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటాను.

– శీల పైడితల్లి, రజక వృత్తిదారుడు, కొత్తపేటగ్రామం, నెల్లిమర్ల మండలం

గతంలో ఏ ప్రభుత్వం సహాయం చేయలేదు



నేను ముప్పై ఏళ్లగా సెలూన్ షాప్ నిర్వహిస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆర్థిక సాయం చేయలేదు. జగనన చేదోడు పథకం ద్వారా నాలుగేళ్లలో ఇంతవరకు రూ.40 వేలు అందుకున్నాను. ఇళ్ల వద్దకే వలంటీర్లు వచ్చి అవసరమైన పత్రాలను పూర్తిచేసి సచివాలయ సిబ్బందికి అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఆర్థిక సాయం చేయడం సంతోషంగా ఉంది. అలాగే నా షాపునకు సంబంధించి 150 యూనిట్లు లోపు వినియోగం ఉండడంతో బిల్లు పూర్తిగా ఉచితం.

– దూరి శ్రీనివాసరావు, నాయీబ్రాహ్మణ వృత్తిదారుడు, నెల్లిమర్ల

అంతులేని విషాదం..

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి
- రోడ్డున పడిన కుటుంబాలు


మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు


స్కూటీని ఢీకొట్టి కాలువలోకి దూసుకెళ్లిన కారు


గూడెపువలస కిరణ్ (ఫైల్)


లంక సూరప్పల నాయుడు (ఫైల్)

భోగాపురం/డెంకాడ: వారిద్దిరూ గతంలో వేర్వేరు గ్రామాల్లో వలంటీర్లుగా పనిచేస్తూ వారి కుటుంబాలకు ఆసరాగా ఉండేవారు. అయితే ఈ మధ్యకాలంలో విపక్షాల విష ప్రచారంతో విసుగు చెందిన వీరిద్దరు ఒకేసారి విధులకు రాజీనామా చేశారు. ఎలాగూ రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందని.. తిరిగి చేరుదామని ఆలోచనలో ఉన్నారు. అయితే ఇంతలో జరగరాని ఘోరం జరిగిపోయింది. రోడ్డు ప్రమాదంలో ఇద్దరూ ఒకేసారి మరణించడంతో ఆయా కుటుంబాలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నాయి. వివరాల్లోకి వెళితే... డెంకాడ మండలం సింగవరం గ్రామానికి చెందిన కిరణ్ (26).. లంకపేటకు చెందిన లంక సూరప్పలనాయుడు (32) వలంటీర్లుగా పనిచేసి ఇటీవల రాజీనామ చేశారు. వీరిద్దరూ సోమవారం రాత్రి పెట్రోల్ కొట్టించేందుకు స్కూటీపై భోగాపురం వచ్చి తిరుగుముఖం పడుతుండగా.. వెనుకనుంచి వచ్చిన కారు వీరిని ఢీ కొట్టింది. దీంతో సంఘటనా స్థలంలోనే ఇద్దరూ కన్నుమూశారు. కిరణ్‌కు ఏడాది కిందటే వివాహం జరగ్గా, ప్రస్తుతం అతని భార్య శైలజ గర్భవతి. మరో మృతుడు సూరప్పలనాయుడుకు మూడేళ్ల కిందట వివాహం జరగ్గా.. భార్య మాధవి, ఏడాది పాప ఉంది. మృతులిద్దరూ కుటుంబాలకు పెద్దదిక్కు కావడంతో వారి కుటుంబాల్లో చీకటి అలముకుంది. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పిట్టా సురేష్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. ప్రమాదంలో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

ఎమ్మెల్యే బడ్డుకొండ పరామర్శ..

భోగాపురం మండలంలోని సుందరపేట ఆస్పత్రిలో ఉన్న గూడెపువలస కిరణ్, లంక సూరప్పలనాయుడు మృతదేహాలను ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనరసయ్య, ఆయన కుమారుడు ప్రదీప్‌నాయుడు సందర్శించి, నివాళులర్పించారు. మృతుల కుటుంబాలను పరామర్శించి, ఓదార్చారు.

జనంలేని యువగళం

- లోకేశ్ యువగళం సభకు ముఖం చాటేసిన జనసేన, బీజేపీ జిల్లా నాయకులు
- సభను పట్టించుకోని యువకులు


జనంలేక బోసిపోయిన లోకేశ్ యువగళం సభ

విజయనగరం రూరల్: విజయనగరం జిల్లా కేంద్రంలో టీడీపీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నేత నారా లోకేశ్ మంగళవారం నిర్వహించిన యువగళం సభ జనంలేక బోసిపోయింది. లోకేశ్ పొంతనలేని సమాధానాలు నవ్వుతెప్పించాయి. చంద్రబాబు రాసిచ్చిన స్క్రిప్టుకు లోకేశ్, ఆయన టీమ్ సభ్యులు ప్రదర్శించిన యాక్టింగ్ జతకావడంతో సభకు హాజరైన ఆ పార్టీ నాయకులకే విసుగుపుట్టించింది. స్థానిక అయోధ్య మైదానంలో లోకేశ్ యువగళం సభ మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. జనం హాజరుకాక పోవడంతో సాయంత్రం 5.10 గంటలకు ప్రారంభించారు. యాంకర్‌ను సైతం విజయవాడ నుంచి రప్పించుకుని తనకు, తన పార్టీకి అనుకూలమైన ప్రశ్నలు అడిగించుకుని మరీ జవాబులు చెబుతుంటే జిల్లా యువత ఆశ్చర్యానికి లోనయ్యారు. రానున్న ఎన్నికల్లో తాము అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే విశాఖను దేశంలోనే నంబర్ వన్ ఉద్యోగ రాజధానిగా చేస్తామని ప్రగల్భాలు పలికాలు. 2014 ఎన్నికల హామీల్లో భాగంగా నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఎగనామం పెట్టారని తన టీమ్ సభ్యులే అడగడంతో కంగుతున్న లోకేశ్.. ఈ సారి అధికారంలోకి వస్తే నిరుద్యోగ భృతి అందిస్తానని నమ్మించారు. జీఓ నంబర్ 3పై అవగాహన లేదని, పరిశీలించి జీఓ రద్దుకు కృషి చేస్తామని మరో ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఇన్‌కమ్ ట్యాక్స్ కడుతున్నవారికీ సంక్షేమ పథకాలు అందిస్తానని సత్తిరాజు అనేవ్యక్తి ప్రశ్నకు లోకేశ్ సమాధానమిచ్చారు. సభకు టీడీపీ మిత్రపక్షాలైన జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొఖం చాటేశారు.

ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ


ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ చేస్తున్న అభ్యుదయవాది జగన్నాథస్వామి, తదితరులు

విజయనగరం టౌన్: ఓటర్లను చైతన్యవంతం చేసి.. ప్రజాస్వామ్య విలువలు కాపాడాలనే ఉద్దేశంతో ఎన్నికల భారతం అనే కవితా సంకలనాన్ని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రజల ముందుకు తీసుకువచ్చిందని అభ్యుదయవాది జగన్నాథస్వామి అన్నారు. మంగళవారం స్థానిక గురజాడ స్వగృహంలో ఎన్నికల భారతం పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సంకలనంలో ఎన్నికల భారతంపై నిర్వహించిన కవితల పోటీలలో ఉత్తమమైన 20 కవితలతో పాటు శ్రీశ్రీ, జాషువా, కాళోజీ వంటి పాతతరం కవులతో పాటు ఈనాటి కవులు పాపినేని శివశంకర్, గౌరునాయుడు, స్వామినాయుడు, అనిల్ డానీ వంటి కవుల కవితలు పొందుపరిచినట్లు చెప్పారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు


ఎస్.నాగలక్ష్మి, జిల్లా ఎన్నికల అధికారి

విజయనగరం అర్బన్: రానున్న సాధారణ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోనున్న వయోవృద్ధులు, దివ్యాంగులకు పోలింగ్ కేంద్రాల వద్ద తగిన వసతులు కల్పించేందుకు ఎన్నికల సంఘం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోందని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతులను వినియోగించుకునే నిమిత్తం ఎన్నికల సంఘం రూపొందించిన సాక్షం యాప్‌లో వారు తమ పేర్లు నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. యాప్‌లో నమోదు చేసుకున్న దివ్యాంగులు, వయోవృద్ధులకు వీల్‌చైర్, పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్లి తిరిగి ఇంటికి తీసుకువచ్చే విధంగా రవాణా సౌకర్యం, తాగునీరు, మరుగుదొడ్లు, షెల్టర్, పార్కింగ్, వలంటరీ సేవలను అందించనున్నట్లు తెలిపారు. సాక్షం యాప్ వినియోగంపై రాష్ట్ర ఎన్నిక సంఘం అదనపు సీఈఓ నిర్వహించిన ఆన్‌లైన్ సమావేశంలో ఆయా వర్గాల వారికి కల్పిస్తున్న వసతులపై అవగాహన కల్పించారని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఎ.డి జీవీబీ జగదీష్ మరో ప్రకటనలో తెలిపారు.

టీడీపీ చేతిలో కీలుబొమ్మలా ఈసీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య, తదితరులు

- ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య

గజపతినగరం రూరల్: ఎలక్షన్ కమిషన్ టీడీపీ చేతిలో కీలుబొమ్మలా మారిందని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఎలక్షన్ కమిషన్ తీరు అగమ్యగోచరంగా తయారైందని ఆరోపించారు. తెలంగాణాలో ఎంపీ ఎన్నికలున్నప్పటికీ, రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందించగా.. మన రాష్ట్రంలో మాత్రం విద్యాకానుక కింద రూ. 610 కోట్లు విడుదల చేయడానికి ఈసీ ఆంక్షలు విధించడం దారుణమన్నారు. అలాగే రైతులకు రూ. 7 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా ఎవ్వరు అడ్డుకుంటున్నారో ప్రజలకు అర్థమైందని చెప్పారు. నేడు ఎన్నికల కమిషన్ ఎవ్వరి చేతుల్లో ఉందో.. ఎవ్వరు చెప్పినట్లు నడుస్తుందో అందరికీ అర్థమైందన్నారు. జగన్ మోహన్‌రెడ్డి హామీలనే చంద్రబాబునాయుడు కాపీ కొట్టి సూపర్ సిక్స్‌గా ఇప్పుడు ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచే విజయాన్ని అందిస్తుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు, పార్టీ మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, బైరెడ్డి శ్రీనివాసరావు, కర్రి రామునాయుడు, పొట్నూరు సూరినాయుడు, ముచ్చర్ల నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నపై నమ్మకంతో...


టీడీపీ, జనసేన పార్టీలను వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు
- టీడీపీ, జనసేనలకు గుడ్‌బై చెప్పిన 200 కుటుంబాలు
- పార్టీలోకి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విజయనగరం: ఎన్నికల సంగ్రామం దగ్గరపడుతున్న తరుణంలో అధికార వైఎస్సార్‌సీపీలోకి వలసలు మరింత ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 16, 46 డివిజన్‌లకు చెందిన 200 మంది పైగా కుటుంబాలు టీడీపీ, జనసేన పార్టీలను వీడి డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సమక్షంలో మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ కోలగట్ల కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులేనని, వారికి ఎల్లవేలలా తన సహకారం ఉంటుందన్నారు. 16వ డివిజన్ కార్పొరేటర్ గుజ్జల నారాయణరావు, 46 డివిజన్ వైఎస్సార్‌సీపీ నాయకుడు బొద్దూరు లక్ష్మణరావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోలగట్ల మాట్లాడుతూ, తాము చేసిన అభివృద్ధిని చూసి ఆకర్షితులై పార్టీలో చేరడం పార్టీ విజయావకాశానికి శుభసూచికమని తెలిపారు. ఏ సమయంలో ఎటువంటి అవసరం వచ్చినా అండగా నిలబడతానని చెప్పారు. రానున్న ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గుజ్జల నారాయణరావు, బొద్దూరు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే శంబంగి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, తదితరులు

బొబ్బిలి: వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ ఫలాలు ప్రజలకు అందుతాయని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పక్కిలో గల ఎమ్మెల్యే స్వగృహం వద్ద తెర్లాం మండలం అరసబలగకు చెందిన 15 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరందరికీ ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ, టీడీపీలో చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో సంక్షేమ పథకాలు వర్తించాయని తెలిపారు. అందుకే టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు ప్రకటించారు. కార్యక్రమంలో నియోజకవర్గ జేసీఎస్ ఇన్‌చార్జ్ శంబంగి వేణుగోపాలనాయుడు, తెర్లాం వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, మాదాసు శేషగిరి, ఆవాల తిరుపతిరావు, రామారావు, రమణ, సాయి మోహన్, సుందరాడ, కొరటాం, పాములవలస సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన ఉప సర్పంచ్ వర్గం..

టీడీపీ మోసపూరిత సిద్ధాంతాలు నచ్చక తాము వైఎస్సార్‌సీపీలో చేరినట్టు మండలంలోని శివడవలస గ్రామ ఉపసర్పంచ్ నాగళ్ల సంగమ్మ, దిబ్బయ్య, తదితరులు తెలిపారు. మండలంలోని పక్కిలోని ఎమ్మెల్యే స్వగృహంలో వీరందరూ వైఎస్సార్‌సీపీలో చేరారు.

జనసేన నుంచి వైఎస్సార్‌సీపీలోకి...


వైఎస్సార్‌సీపీలో చేరిన ముషిడిపల్లి యవకులతో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

శృంగవరపుకోట: మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే హైమావతి, పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడుబండి మాట్లాడుతూ, పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ గౌరవప్రదమైన స్థానం దక్కుతుందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ముషిడిపల్లి గ్రామ పెద్దలు , వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అల్లూరికి ఘన నివాళులు


అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సమితి సభ్యులు

విజయనగరం: మన్యం వీరుడు అల్లూరి సీతా రామరాజు శత వర్ధంతి కార్యక్రమాన్ని అల్లూరి సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సమితి అధ్యక్షుడు కేపీ ప్రసాద్‌రాజు, కార్యదర్శి సాగి శివాజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా దాసన్నపేట అల్లూరి సీతారామరాజు జంక్షన్ లో గల విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అధ్యక్షుడు శివ మాట్లాడుతూ.. 22 సంవత్సరాల వయస్సులోనే బ్రిటిష్ వారిపై తిరుగుబాటు చేసిన వీరుడు అల్లూరిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అల్లూరి సీతా రామరాజుకు మూలికా వైద్యం, గుర్రపుస్వారీ, జ్యోతిషం, తదితర అంశాలలో ఎంతో నైపుణ్యం ఉందని చెప్పారు. కార్యక్రమంలో అల్లూరి సేవా సమితి సభ్యులు చంటి రాజు, ఎస్ఎన్ఎం రాజు, వర్మరాజు, గదుల సత్యలత, తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో పైడితల్లి


ప్రత్యేక పూలంకరణలో అమ్మవారు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం , కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావు, నేతేటి ప్రశాంత్‌లు శాస్త్రోక్తంగా అమ్మవారికి పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈఓ డీవీవీ ప్రసాదరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.